సాక్షి ఆదిలాబాద్

గురువారం । 24 । ఏప్రిల్ । 2025

నస్పూర్‌లో ఏసీబీ కార్యాలయం

ఏసీబీ కార్యాలయం త్వరలో మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్‌లో ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 10లో▸



కప్పర్లలో అగ్నిప్రమాదం

తాంసి మండలంలోని కప్పర్ల గ్రామంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పశువుల కొట్టంతో పాటు మూడు మ్యాక్స్ వాహనాలు దగ్ధమయ్యాయి. 11లో▸

గరిష్టం/కనిష్టం
43.0/29.0

వాతావరణం

మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. వడ గాలులు వీస్తాయి. ఉక్కపోత ప్రభావం అధికంగా ఉంటుంది.

నినాదాలు చేస్తున్న హిందూ సంఘాల నాయకులు



కొవ్వొత్తుల ర్యాలీలో లయన్స్‌క్లబ్ సభ్యులు



ఉగ్రదాడిపై నిరసన

ఆదిలాబాద్: జమ్మూ కశ్మీర్ బైసారన్ వ్యాలీలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా హిందూ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో ఆందోళన నిర్వహించారు. వినాయక చౌక్‌లో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినదించారు. దుండగులకు మరణశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఇందులో హిందూ సంఘాల నాయకులు రాళ్ల బండి మహేందర్, గంద్రత్ మహేందర్, దినేష్ మటోలియా, సాయి తేజ, హనుమండ్లు, కార్తీక్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ..
జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకులకు నివాళులర్పించారు.



తాంసి మండలం లింగుగూడలో గల ఓ బెల్టు షాపులో ఈనెల 16న మహారాష్ట్ర నుంచి దేశీదారు తీసుకొచ్చి విక్రయిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు గుర్తించారు. 280 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆదిలాబాద్‌రూరల్ మండలం భీంసరి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల 500 దేశీదారు బాటిళ్లు తీసుకొస్తుండగా పక్కా సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



- ఆదిలాబాద్ పట్టణంలోని వన్‌టౌన్ పరిధిలో బెల్టుషాపు నిర్వహిస్తున్న ఇద్దరిపై స్థానిక పోలీసులు ఇటీవల కేసులు నమోదు చేశారు. అలాగే టూటౌన్ పరిధిలో వడ్డెర కాలనీ తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న బెల్టుషాపులపై దాడులు జరిపి పలువురిపై కేసులు నమోదు చేశారు.

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లాకు పీసీసీ పరిశీలకులు

- ఒక్కో జిల్లాకు ఇద్దరేసి చొప్పున నియామకం

కైలాస్‌నగర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై కాంగ్రెస్ అధిష్టానం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఏఐసీసీ పిలుపునిచ్చే కార్యక్రమాలను విజయవంతం చేసేలా చూడటంతో పాటు పార్టీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టింది. ఇందుకు గాను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు పీసీసీ పరిశీలకులను నియమించింది. ఒక్కో జిల్లాకు ఇద్దరిని నియమిస్తూ ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఉత్తర్వులు జారీ చేసినట్లుగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాకు తహెర్ బిన్ హందాన్, చిట్ల సత్యనారాయణ, నిర్మల్‌కు ఎం.చంద్రశేఖర్ గౌడ్, ఎండీ.అవేజ్, మంచిర్యాలకు జంగా రాఘవరెడ్డి, సీహెచ్.రాంభూపాల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు ఎండీ.రియాజ్, అంతేటి అన్నయ్య గౌడ్‌ను నియమించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

వదంతులు నమ్మవద్దు

ఆదిలాబాద్‌టౌన్: సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మవద్దని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి అన్నారు. డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా సోషల్ మీడియా పోస్టులపై నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎలాంటి అనుమానాలు, సందేహాలు ఉన్నా జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని సంప్రదించాలని సూచించారు. అత్యవసర సమయంలో డయల్ 100కు సమాచారం అందించాలని, ఐదు నిమిషాల వ్యవధిలో సంఘటనా స్థలాలకు పోలీసులు చేరుకునేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

రాయితీ సద్వినియోగం చేసుకోండి



సమీక్షిస్తున్న కమిషనర్ సీవీఎన్ రాజు

కైలాస్‌నగర్: ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లించే వారికి 5శాతం రాయితీ కల్పించినట్లు మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఎర్లీబర్డ్ పథకం అమలు తీరుపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేటాయించిన వార్డుల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ వీలైనంత మేర పన్ను వసూలు చేసేలా శ్రద్ధ వహించాలన్నారు. ఈ నెల 30 వరకు గడువు ఉందని, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో ఆర్‌వో స్వామి, ఆర్‌ఐలు వెంకటేశ్, హన్మంతు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పీడీపై సస్పెన్షన్ వేటు

ఆదిలాబాద్‌టౌన్: మావల మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న గుండి మహేశ్‌పై సస్పెన్షన్ వేటు వేసినట్లు డీఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పాఠశాల విద్యార్థినిలతో పాటు యోగా టీచర్‌పై అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆయనపై కేసు నమోదైనట్లు పేర్కొన్నారు. మావల పోలీసులు రిమాండ్‌కు తరలించడంతో ఆయనపై చర్యలు తీసుకున్నట్లు డీఈవో వివరించారు.

ప్రయత్నం వీడలే



సాయిచైతన్య జాదవ్

- విజయం సాధించే దాకా ఆపలే..
- నిష్కామకర్మను ఫాలో అయ్యా..
- ఆరో ప్రయత్నంలో లక్ష్యం సాధించా
- ట్రైబల్, రూరల్ డెవలప్‌మెంట్‌కు కృషి
- 'సివిల్స్' 68వ ర్యాంకర్ సాయిచైతన్య జాదవ్ మనోగతం

సాక్షి,ఆదిలాబాద్: 'ఈ ఆనంద క్షణాలను మరువలేను.. పట్టుదల వీడకుండా చేసిన ప్రయత్నమే నన్ను విజయతీరాలకు చేర్చింది.. యూపీఎస్సీ అంటేనే తీవ్రమైన పోటీ. ఆరేళ్లుగా సాగిన నా ప్రిపరేషన్ మొత్తం ఈ సారి అత్యుత్తమ ర్యాంక్ రావడానికి దోహదపడింది..' అని అన్నారు ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు చెందిన సాయిచైతన్య జాదవ్. మంగళవారం విడుదలైన సివిల్ సర్వీస్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 68వ ర్యాంకు సాధించి జిల్లా కీర్తిని ఇనుమడింపజేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఉన్న ఆయనను 'సాక్షి' బుధవారం ఫోన్ ద్వారా 'ఇంటర్వ్యూ' చేసింది. ఈ సందర్భంగా ఆయన తన సక్సెస్‌కు దారితీసిన అంశాలను ఇలా వివరించారు.

సాక్షి: మీ కుటుంబ నేపథ్యం..

సాయిచైతన్య: మాది తలమడుగు మండలం పల్సి (బి) గ్రామం. మహారాష్ట్రకు సరిహద్దుగా ఉంది. నాన్న గోవింద్‌రావ్ హెడ్‌కానిస్టేబుల్. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలో పనిచేస్తున్నారు. అమ్మ కవిత ఉట్నూర్ ఎంపీపీఎస్‌లో ఉపాధ్యాయురాలు. సోదరి శృతికి వివాహమైంది. హైదరాబాద్‌లో డాక్టర్. 20ఏళ్ల క్రితం మా కుటుంబం పల్సి(బి) నుంచి వచ్చి ఉట్నూర్‌లో స్థిరపడ్డాం.

సాక్షి: మీ విద్య ఎక్కడెక్కడ సాగింది..

జాదవ్: ఉట్నూర్‌లోనే ప్రాథమిక విద్య పూర్తయింది. ఆ తర్వాత కాగజ్‌నగర్ నవోదయ పాఠశాలలో పదో తరగతి వరకు చదివా. ఇంటర్ హైదరాబాద్‌లోని ప్రైవేట్ కళాశాలలో పూర్తి చేశా. ఆ తర్వాత తమిళనాడులోని తిరుచ్చి ఐఐటీలో బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశా.

సాక్షి: ఐఏఎస్ లక్ష్యం ఎప్పుడు పెట్టుకున్నారు..

జాదవ్: అమ్మ నాన్నకు ముందు నుంచి మమ్మల్ని మంచి హోదాలో చూడాలనే కోరిక ఉండేది. దాన్ని నేను పైకి తీసుకెళ్లాను. పెద్ద పోస్టు సాధించాలని ముందు నుంచి అనుకున్నాను. ఆ లక్ష్యంలో మా ఫాదర్, మదర్ సపోర్టు ఉంది.

సాక్షి: ర్యాంక్ వచ్చేందుకు దోహదపడిన అంశాలు..

జాదవ్: బీటెక్ పూర్తయిన వెంటనే 2019లో మొదటి సారి తమిళనాడులోనే సివిల్ సర్వీసెస్ రాశాను. అప్పుడు ప్రిలిమ్స్‌లోనే తప్పాను. తర్వాత 2020లో రెండోసారి రాయగా, మెయిన్స్‌లో పోయింది. మూడు, నాలుగో ప్రయత్నంలో 2021, 2022 ఇంటర్వ్యూలో చేజారింది. 2023లో 131వ ర్యాంక్ సాధించాను. ఐఎఫ్ఎస్‌కు ఎంపికయ్యాను. ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయించారు. ఆ శిక్షణ తీసుకున్నాను. ఆ తర్వాత సెలవు పెట్టి మళ్లీ ప్రిపేర్ అయ్యాను. తాజాగా విడుదలైన ఫలితాల్లో ఈ ర్యాంక్ సాధించాను.

సాక్షి: మీ శిక్షణ అనుభవాలను చెప్పండి

జాదవ్: ఆరో సారికి నేను 68వ ర్యాంక్ సాధించాను. గత ఐదుసార్లు రాసింది నాకెంతో ఉపయోగపడింది. నా ప్రిపేరేషన్ క్రమంలో ఎంతో మంది మిత్రులు దొరికారు. ఐదుగురం మిత్రులం కలిసి హైదరాబాద్ అశోక్‌నగర్‌లో నివాసం ఉంటూ ప్రిపరేషన్ కొనసాగించాను. ఐదేళ్లుగా వివిధ అకాడమిల్లోనూ శిక్షణ తీసుకున్నాం. ఈ ఫలితాల్లో నాతోపాటు మరో ఇద్దరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మిత్రులు మంచి ర్యాంక్ సాధించారు.

సాక్షి: సివిల్ సర్వీస్‌కు ప్రిపేర్ అయ్యేవారికి, ర్యాంక్ రానివారికి మీరిచ్చే సూచన

జాదవ్: సివిల్ సర్వీస్‌కు ప్రిపేర్ అయ్యేవారు, ర్యాంక్ రానివారు తమ ప్రయత్నాన్ని కొనసాగించాలి. ఐదేళ్లుగా నా పరిస్థితిని ఊహించుకోవచ్చు. ప్రస్తుతం ర్యాంక్ రానివారిలో నా ఫ్రెండ్స్ చాలా మంది ఉన్నారు. ఇంతకుముందు నా ఫ్రెండ్స్ ఎవరైతే ర్యాంక్ సాధించారో.. వాళ్లను చూసి నేను మదిలో అనుకునేవాడిని.. నేను ఎప్పుడు లక్ష్యం చేరుకుంటానని.. అందుకే నేను చెప్పేదేమిటంటే అటెంప్ట్ ఉంటే ప్రయత్నం కొనసాగించాలి.. నిన్నటి వరకు నేను ర్యాంక్ సాధిస్తానని కూడా అనుకోలేదు. మంగళవారం రిజల్ట్ వచ్చేవరకు వస్తదో.. రాదో అనే బెంగ వెంటాడింది. చివరికి ఆన్‌లైన్‌లో నా నంబర్ సెర్చ్ చేసేంత ధైర్యం కూడా నాకు తొలుత కలగలేదు. ఎలాగోలా సెర్చ్ చేస్తూ పైనుంచి చూస్తూ వచ్చాను. సెకండ్ పేజీలో కనిపించింది. అయితే సివిల్ సర్వీస్‌కు ప్రిపరేషన్‌లో నాది ఒకటే ఫిలాసఫి సాగింది.. నిష్కామకర్మను ఫాలో అయ్యాను. దాని అర్థం ఏమిటంటే.. ప్రయత్నిస్తూనే ఉండాలి. అటెంప్ట్స్ అయిపోయిన వారికి కూడా మన దేశంలో అనేక అవకాశాలు ఉన్నాయి. ఫారెన్ సర్వీసెస్‌పై దృష్టి సారించాలి. గ్రూప్–1 కూడా ఎంపిక చేసుకోవచ్చు.

సాక్షి: ఐఏఎస్‌గా మీ లక్ష్యాలు ఎలా ఉండబోతున్నాయి..?

జాదవ్: నేను చిన్నప్పుడు చదువుకునేటప్పుడు చూశాను.. ఆదిలాబాద్ జిల్లాలో ఎన్నో సమస్యలు ఉన్నాయి.. అలాంటి వాతావరణంలోనే నేను పెరిగాను.. చుట్టుపక్కలా ఎవరినైనా చూస్తే పూర్ బ్యాక్‌గ్రౌండ్ నుంచి వచ్చే వారే ఉండేవారు. గవర్నమెంట్ వైపు ఏదైనా పథకం కోసం చూసేవారు. అయితే ఆ స్కీమ్ వారి వరకు రీచ్ అవుతుందా.. లేదో.. ఆ స్కీమ్‌ను అలాంటి వారికే అందించేందుకు బ్యూరోకసి తోడ్పడుతుందని నా భావన. ఐఏఎస్‌గా ప్రభుత్వ పథకాలను పేదల దరికి చేర్చడం, ట్రైబల్, రూరల్ డెవలప్‌మెంట్ నా ముఖ్య ఉద్దేశాలుగా ఉండబోతున్నాయి.

'బెల్టు' తీయరేమి?

- జిల్లాలో జోరుగా బెల్టుషాపుల నిర్వహణ
- 'మహా' సరిహద్దులో యథేచ్ఛగా దేశీదారు విక్రయాలు
- 'మామూలు'గా వ్యవహరిస్తున్న ఎక్సైజ్ శాఖ



జిల్లా కేంద్రంలోని సుందరయ్య నగర్‌లో నిర్వహిస్తున్న ఓ బెల్టుషాపు(ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: బెల్టు షాపులతో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుపుతుండడంతో కూలీనాలి చేసేవారు వాటికి అలవాటుపడి విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ముఖ్యంగా యువత మద్యం మత్తులో తూగుతున్నారు. దీంతో గొడవలకు దారి తీస్తున్నాయి. ఇటీవల పలువురు హత్యలు, దాడులకు పాల్పడిన ఘటనలు సైతం చోటుచేసుకున్నాయి. తెల్లవారుజామునే బెల్టుషాపులు తెరుచుకుంటున్నాయి. అర్ధరాత్రి వరకు కొనసాగుతుండడంతో మద్యం బాబులు నిత్యం కిక్కులోనే ఉంటున్నారు. కొందరు కిరాణ షాపులు, హోటళ్లు, పాన్‌షాపులు, ఇళ్లలో వీటిని నిర్వహిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు నామమాత్ర తనిఖీలకే పరిమితమవుతుండడంతో వీరి వ్యాపారం మూడు బాటిళ్లు.. ఆరు బీర్లు అన్న చందంగా సాగుతుందనేవిమర్శలున్నాయి.

పుట్టపుగొడుగుల్లా బెల్టుషాపులు..
జిల్లాలో బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. గల్లీకొకటి చొప్పున దర్శనమిస్తున్నాయి. పల్లెల్లో వీడీసీల ద్వారా వేలం నిర్వహించి అనధికారికంగా విక్రయాలు చేపడుతున్నారు. బాటిల్‌కు రూ.10 నుంచి రూ.20 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు.

ఏరులైపారుతున్న దేశీదారు..
మహారాష్ట్ర సరిహద్దున గల గ్రామాల్లో వెలిసిన బెల్టుషాపుల్లో దేశీదారు ఏరులై పారుతోంది. ఇటీవల ఎక్సైజ్, పోలీసు అధికారులు వీటిపై దాడులు చేసి వందల సంఖ్యలో బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. జైనథ్, బేల,భీంపూర్ తదితర మండలాల్లో వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మహారాష్ట్రలో దేశీదారు బాటిల్ ధర రూ.80 ఉండగా, ఇక్కడ రూ.120 నుంచి రూ.140 వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ద్విచక్ర వాహనాలు, కాలినడకన వీటిని రవాణా చేస్తున్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం..
నిబంధనల ప్రకారం లైసెన్స్ ఉన్న వారు మాత్రమే మద్యం విక్రయించాలి. అయితే జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా చాలాచోట్ల బెల్టు షాపులు ఏర్పాటు చేసుకొని విచ్చలవిడిగా విక్రయాలు సాగిస్తున్నారు. తక్కువ ధరకు లభించే మద్యంతో పాటు కల్తీ మద్యం విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లు తెలుస్తోంది. వీరికి ఆయా రాజకీయ పార్టీల నాయకుల అండదండలు ఉండడంతో సంబంధిత శాఖ అధికారులు సైతం 'మామూలు'గా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



నిబంధనలు అతిక్రమించి మద్యం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. రాత్రి 10 తర్వాత ఎవరైనా మద్యం విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. ఇటీవల దాబా హోటళ్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించాం. అలాగే డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నాం.
– అఖిల్ మహాజన్, ఎస్పీ

భూభారతితో రైతుల సమస్యలు పరిష్కారం

- కలెక్టర్ రాజర్షిషా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

ఇంద్రవెల్లి: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకొచ్చిందని కలెక్టర్ రాజర్షిషా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నూతన చట్టంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు హాజరై మాట్లాడారు. ఆధార్‌కార్డు మాదిరిగా రైతులకు భూధార్ కార్డు పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. జూన్ 2 నుంచి పోర్టల్ పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తుందన్నారు. అనంతరం కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ముందుగా డిప్యూటీ తహశీల్దార్ రమేశ్ ఆధ్వర్యంలో భూ భారతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఆర్డీవో రాథోడ్ రవీందర్, ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డొంగ్రె, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్,ఎంపీడీవో జీవన్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు
గట్టెపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గ్రామంలో అడుగంటిన బావి, చేతిపంపుతో పాటు ఇటీవల తవ్విన బావిని పరిశీలించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. అలాగే మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్న పంట కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు.

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ రాజర్షిషా,ఎమ్మెల్యే బొజ్జు హాజరయ్యారు. పలువురు రైతులు తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ఇందులో తహసీల్దార్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం
కైలాస్‌నగర్: నార్నూర్ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా ఇటీవల జాతీయ పురస్కారం అందుకున్న కలెక్టర్ రాజర్షి షాను సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో వేద పండితుల ఆశీర్వచనాల నడుమ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రీ కలెక్టర్‌ను సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఇందులో సమితి ప్రతినిధులు మాధవ్, సూర్యకాంత్, రవీందర్, నర్సింలు, వేణు, సంజీవ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ'కు రుణసాయం

- ఎస్‌హెచ్‌జీల ద్వారా అందించేందుకు కసరత్తు
- ఇళ్ల నిర్మాణాల వేగవంతంపై అధికారుల దృష్టి

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం వివరాలు:
పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన గ్రామాలు: 17
మంజూరు చేసిన ఇళ్ల సంఖ్య : 2,148
మార్కవుట్ ఇచ్చినవి: 1,022
బేస్‌మెంట్ వరకు పూర్తయినవి : 118
ఇంకా ప్రారంభించనివి : 1,126



తాంసి మండలం హస్నాపూర్‌లో పూర్తయిన బేస్‌మెంట్

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసే దిశగా యంత్రాంగం దృష్టి సారించింది. జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలన్నీ ప్రారంభించే దిశగా చర్యలు చేపడుతోంది. ఇప్పటికే పలువురు మొదలు పెట్టగా.. చాలామంది ఆర్థిక ఇబ్బందులతో షురూ చేయలేదు. అలాంటి వారిని గుర్తించి త్వరగా ప్రారంభించేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా రూ.లక్ష వరకు ఆర్థికసాయం అందించేలా యోచిస్తున్నారు. ఈ మేరకు హౌసింగ్, డీఆర్డీఏ అధికారులు, ఎంపీడీవోలతో మంగళవారం గూగుల్ మీట్ ద్వారా సమీక్షించిన కలెక్టర్ ఆ దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తదనుగుణంగా ఆయా శాఖల అధికారులు కసరత్తు ప్రారంభించారు.

భారీగా మెటీరియల్ ధరలు..
పేదల సొంతింటి కల సాకారం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. పైలట్ ప్రాజెక్ట్ కింద మండలానికి ఒకటి చొప్పున 17 గ్రామాలను ఎంపికచేసి అర్హులైన వారికి మంజూరు చేసింది. ఇందులో కొంత మంది నిర్మాణాలు ప్రారంభించారు. హౌసింగ్ శాఖ ఇచ్చిన మార్కవుట్ ప్రకారం పనులు చేపడుతున్నారు. కొంతమంది బేస్‌మెంట్ సైతం పూర్తి చేశారు. చాలా వరకు మాత్రం నిర్మాణాలకు ముందుకు రావడం లేదు. ఇసుక, సిమెంట్, స్టీల్ ధరలు భారీగా ఉండటంతో పాటు ఆర్థిక స్థోమత లేకపోవడంతో పనులు చేపట్టేందుకు వెనుకాడుతున్నారు. పాత ఇళ్లను తొలగించి పునాదులు తీసుకుంటే ప్రభుత్వమిచ్చే డబ్బులు ఆలస్యమైతే తమ పరిస్థితి ఏంటనే ఆందోళనతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇలాంటి వారిని గుర్తించి స్వయం సహాయక సంఘాల ద్వారా రూ.లక్ష వరకు వడ్డీలేని రుణాలు అందించాలని అధికారులు నిర్ణయించారు. ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు. ఈ సాయం మంజూరు చేసినట్లైతే పనులు ముమ్మరమై నిర్మాణాలు త్వరగా పూర్తయ్యే అవకాశముంటుందని భావిస్తున్నారు. ప్రభుత్వం జమ చేసిన డబ్బులను తిరిగి ఎస్‌హెచ్‌జీలకు అందించేలా చర్యలు చేపడుతున్నారు. ఈ నిర్ణయంపై ఇప్పటి వరకు ఇంటి నిర్మాణాలు చేపట్టని వారిలో హర్షం వ్యక్తమవుతోంది.

నాలుగు విడతల్లో ఆర్థిక సాయం
ఇందిరమ్మ లబ్ధిదారులకు నాలుగు విడతల్లో ఇంటి నిర్మాణానికి అవసరమైన రూ.5లక్షల ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో మొదట పునాదులు పూర్తయితే రూ.లక్ష, పిల్లర్లు వేసిన తర్వాత 1.25లక్షలు, స్లాబ్ తర్వాత రూ.1.75లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు. ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో రూ.లక్ష చొప్పున జమ చేయనున్నారు. ఆర్థిక స్థోమత లేని లబ్ధిదారులకు ఐకేపీ ద్వారా మరో రూ. లక్ష రుణం అందించనున్నారు. అయితే లబ్ధిదారు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులై ఉండటంతో పాటు వారు ఉన్న సంఘం రుణానికి అర్హత కలిగి ఉన్నట్లేతేనే అందజేయనున్నారు.

వివరాలు సేకరిస్తున్నాం

ఇందిరమ్మ ఇళ్లు మంజూరై ఆర్థికస్థోమత లేని లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. కలెక్టర్ సైతం సూచనలు చేశారు. తదనుగుణంగా వారి వివరాలుఅందించాలని జెడ్పీ సీఈవోకు సూచించాం. వారిచ్చే వివరాల ప్రకారం లబ్ధిదారులు ఎస్‌హెచ్‌జీల్లో ఉన్నారా.. ఆ సంఘానికి రుణం పొందే అర్హత ఉందా.. అనే వివరాలు పరిశీలించి రుణసాయం అందించేలా చర్యలు చేపడుతాం. – రాథోడ్ రవీందర్, డీఆర్డీవో

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- ఎస్పీ అఖిల్ మహాజన్
- బస్టాండ్ వద్ద సబ్ కంట్రోల్ రూం ప్రారంభం

ఆదిలాబాద్‌టౌన్: నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన సబ్ కంట్రోల్ రూంను బుధవారం ప్రారంభించారు. ఏఎస్సై ముకుందరావుకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బస్టాండ్, పరిసర ప్రాంతాల్లో చిన్నపాటి దొంగతనాలు, ఈవ్ టీజింగ్, రోడ్డు ప్రమాదాలు వంటి ఘటనలు చోటు చేసుకుంటే తక్షణ సాయంగా పోలీసులు అందుబాటులో ఉంటారన్నారు. క్షణాల వ్యవధిలో స్పందించేలా ఉదయం నుంచి రాత్రి వరకు ఏఎస్సైతో పాటు హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, వన్‌టౌన్, టూటౌన్, ట్రాఫిక్ సీఐలు సునిల్ కుమార్, కరుణాకర్‌రావు, ప్రణయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వయోవృద్ధులకు పూర్తి సహకారం
జిల్లా పోలీసు యంత్రాంగం వయోవృద్ధులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. తెలంగాణరాష్ట్ర వయోవృద్ధుల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం వన్‌టౌన్ ఎదుట ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో ఆర్డీవో వినోద్ కుమార్, సంఘం సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సబ్‌కంట్రోల్‌రూం ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

క్లుప్తంగా

చెట్టును ఢీకొట్టిన కారు



ప్రమాదస్థలంలో కారు

కడెం: మండలంలోని దోస్తనగర్ సమీపంలో కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హాజీపూర్‌కు చెందిన దముఖ శివకృష్ణ తన కుమారుడు శ్రీకాంత్‌తో కలిసి తన కారులో జన్నారం నుంచి కడెం మండలంలోని నచ్చన్ఎల్లాపూర్ వెళ్తుండగా మార్గమధ్యలో దోస్తనగర్ సమీపంలోని ఐ లవ్ కవ్వాల్ లోగో వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివకృష్ణకు తీవ్ర గాయాలు కాగా, శ్రీకాంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ప్రైవేటు వాహనంలో జన్నారంలోని ఓ ఆసుపత్రికి తరలించారు.

పేకాటస్థావరంపై దాడి

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఊత్కూరు చౌరస్తా సమీపంలో నిర్మానుష్య ప్రదేశంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి నిర్వహించి ఊత్కూరు గ్రామానికి చెందిన తుమ్మల సునీల్, ఏనుగుల తిరుపతి, గౌరువంతుల ప్రశాంత్, కడమండ్ల శేఖర్, ముప్పు శ్రీధర్, సత్యసాయి నగర్‌కు చెందిన ఎస్‌కె సనీర్, బుఖ్య రాజు, రాచర్ల రాకేశ్, పేరం పోచం అనే వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3470ల నగదు, ఐదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్క్రాప్ పట్టివేత

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీ నుంచి అక్రమంగా తరలిస్తున్న ఐరన్ స్క్రాప్‌ను సింగరేణి ఎస్అండ్‌పీసీ సెక్యూరిటీ సిబ్బంది చాకచక్యంగా పట్టుకున్నారు. బుధవారం ఓసీపీ ఎంట్రన్స్ సమీపంలో ఆటోలో తరలిస్తున్న బెల్ట్ రోలర్, ఇతర సామగ్రిని పట్టుకున్నారు. ఓసీపీ రోడ్లపై దుమ్ము లేవకుండా నీటి ట్యాంకర్‌ను ఉపయోగిస్తున్నారు. ఈ ట్యాంకర్‌ను ప్రైవేటు కాంట్రాక్టర్ నిర్వహిస్తున్నారు. ట్యాంకర్ డ్రైవర్ క్వారీ లోపల నీటిని నింపుకునే క్రమంలో అక్కడ ఉన్న ఈ స్క్రాప్‌ను ట్యాంకర్‌లో వేసుకొని పైకి తీసుకొచ్చినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్యాంకర్ నుంచి తీసి స్క్రాప్‌ను చెట్ల పొదల్లో ఆటోలోకి మార్చుతున్న సమయంలో ఎంటీఎఫ్ సెక్యూరిటీ సిబ్బంది అనుమానం వచ్చి చూసే సరిగా దొంగతనం బయటపడింది. సిబ్బందిని చూసి దొంగలు పారిపోగా ఆటోను, స్క్రాప్‌ను స్వాధీనం చేసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోదాలు జరిగినట్లు తెలుస్తోంది.

రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఒకరు మృతిచెందినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. జైనథ్ మండలంలోని మేడిగూడకు చెందిన గొర్ల గణేశ్ (35) ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్నాడు. పెట్రోల్ బంక్‌లో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఫిట్స్‌తో బాధపడుతుండగా ఉద్యోగం మానేశాడు. మానసికంగా కుంగిపోయిన ఆయన ఈనెల 19న తన ఇంటి వద్ద పురుగుల మందు సేవించగా, గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నస్పూర్‌లో ఏసీబీ కార్యాలయం

- ప్రారంభానికి సిద్ధమైన భవనం
- ఇక్కడే ఆసిఫాబాద్, మంచిర్యాల కేసుల పర్యవేక్షణ
- సీసీసీ నస్పూర్ పాత సీఐ కార్యాలయంలో ఏర్పాట్లు
- ప్రస్తుతం ఆదిలాబాద్‌లో కొనసాగుతున్న వైనం



సీసీసీ నస్పూర్‌లో ప్రారంభానికి సిద్ధమైన ఏసీబీ కార్యాలయ భవనం

నస్పూర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఏసీబీ కార్యాలయానికి అనుబంధంగా త్వరలోనే మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్‌లో ఏసీబీ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. సీసీసీ నస్పూర్‌లోని సింగరేణి క్వార్టర్‌లో కొనసాగిన పాతపోలీస్‌స్టేషన్ పక్కన గల సీఐ కార్యాలయంలో ఏసీబీ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. క్వార్టర్‌లో మరమ్మతులు పూర్తి చేసి వారం, పది రోజుల్లో ప్రారంభిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

తగ్గనున్న దూరభారం..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించిన ఏసీబీ కార్యాలయం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఉంది. ప్రస్తుతం ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐలు, ఇతర సిబ్బందితో కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల బాధితులు అవినీతి అధికారులపై ఏసీబీకి నేరుగా ఫిర్యాదు చేయాలంటే వ్యయప్రయాసలకోర్చి ఆదిలాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు సైతం ఫిర్యాదులపై విచారణ జరిపేందుకు ఆదిలాబాద్ నుంచి మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలకు రావాలంటే చాలా కష్టపడాల్సి వస్తోంది. కాగా నస్పూర్‌లో కార్యాలయం ఏర్పాటైతే అన్నింటికీ సులభతరంగా ఉండనుంది.

పెరుగనున్న ఫిర్యాదులు..

నస్పూర్ పట్టణంలో సమీకృత కార్యాలయం ఉండడం, అధికంగా ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఉండడంతో సంబంధిత శాఖల అధికారులు భారీగానే అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆసిఫాబాద్ జిల్లా వాసులకు సైతం నస్పూర్ రాకపోకలకు అనుకూలంగా ఉంటుంది. నస్పూర్ పట్టణంలో ఏసీబీ కార్యాలయం ఏర్పాటవుతున్న దృష్ట్యా అవినీతి అధికారులపై ఫిర్యాదులు పెరిగే అవకాశం ఉందని జిల్లావాసులు చర్చించుకుంటున్నారు. ఓ వైపు సీసీసీ నస్పూర్ పాత పోలీస్‌స్టేషన్ భవనంలో భరోసా కేంద్రం కొనసాగుతుండగా పక్కనే ఏసీబీ కార్యాలయం ఏర్పాటుపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండు జిల్లాల కేసులు పర్యవేక్షణ..

నస్పూర్‌లో ఏర్పాటయ్యే కార్యాలయంలో ఒక సీఐ, ఇతర సిబ్బంది ఉంటారు. వారు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీఎస్పీ పర్యవేక్షణలో మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలకు సంబంధించిన కేసులను పర్యవేక్షించనున్నారు. ఆదిలాబాద్ కార్యాలయం నుంచి నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు సంబంధించిన కేసులను పర్యవేక్షించనున్నట్లు అధికా రులు పేర్కొన్నారు.

ప్రారంభానికి చర్యలు



నస్పూర్ ఏసీబీ కార్యాలయం ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. సింగరేణి అధికారులు భవనాన్ని తమకు అప్పగించిన తర్వాత ఉన్నతాధికారుల సమయం తీసుకుని వారం, పది రోజులలో ప్రారంభిస్తాం.

– విజయ్‌కుమార్, ఏసీబీ డీఎస్పీ

'అణగారిన వర్గాలకు ఆసుపత్రులు కరువు'



ఆసుపత్రిని పరిశీలిస్తున్న విశారదన్ మహరాజ్

బేల: అణగారిన పేద వర్గాలకు కనీసం ఆసుపత్రులు కూడా దిక్కులేవని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్, ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి అక్కడ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్వహణ అధ్వానంగా ఉండడంతో తానే స్వయంగా చీపురుతో ఊడ్చారు. అనంతరం శంషాబాద్‌లో ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కోడె గోవిందు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. తెలంగాణలో ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లాలో రైతు ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని, కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని పెడచెవిన పెట్టాయన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర నాయకులు అన్నెల లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్ మహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాస్తూ..



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాజేశ్ మీనా, సీఐ ప్రవీణ్ కుమార్

నిర్మల్‌టౌన్: ఓపెన్ స్కూల్ ఎస్ఎస్‌సీ పరీక్షను ఒకరికి బదులు మరొకరు రాస్తూ ఇన్విజిలేటర్‌కు పట్టుబడిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ రాజేశ్ మీనా బుధవారం వివరాలు వెల్లడించారు. స్థానిక సోమవార్‌పేట్‌లో గల ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో ఓపెన్ స్కూల్ ఎస్ఎస్‌సీ పరీక్ష నిర్వహిస్తున్నారు. దాసర్ల రత్నాకర్ అనే వ్యక్తి పరీక్ష రాయాల్సి ఉండగా అతని స్థానంలో కందుల జయవర్ధన్ పరీక్షకు హాజరయ్యాడు. ఇన్విజిలేటర్ అతని హాల్‌టికెట్ తనిఖీ చేయగా పట్టుబడ్డాడు. వెంటనే పట్టణ పోలీసులకు సమాచారం అందజేయగా అక్కడకు చేరుకుని రత్నాకర్, జయవర్ధన్‌లపై కేసు నమోదు చేయడంతో పాటు అతని ఎగ్జామ్ పేపర్, హాల్ టికెట్ సీజ్ చేశారు.

టిప్పర్ ఢీకొని రిటైర్డ్ టీచర్ మృతి



టిప్పర్ టైరు కింద నుజ్జునుజ్జయిన ద్విచక్రవాహనం

ఆదిలాబాద్‌టౌన్: టిప్పర్ ఢీకొట్టి రిటైర్డ్ టీచర్ మృతిచెందిన ఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్‌రూరల్ మండలం చాందా (టి) గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ దేవళ్ల నారాయణ (65) జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో ఉంటున్నాడు. ఉదయం మార్నింగ్ వాక్ అనంతరం గాంధీ పార్కు నుంచి విద్యానగర్ వైపు వెళ్తుండగా కుమురంభీం చౌక్‌లో గల సర్కిల్ వద్ద టిప్పర్ ఆయనపై దూసుకెళ్లింది. దీంతో తీవ్ర గాయాలపాలైన ఆయనను స్థానికులు చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్కిల్‌తో ప్రమాదాలు..

సుందరీకరణ పేరిట గత ప్రభుత్వం జిల్లా కేంద్రంలోని పలు ముఖ్య కూడళ్లలో సర్కిల్స్ ఏర్పాటు చేసింది. గతంలో కుమురంభీం చౌక్ వద్ద సిగ్నల్స్ ఉండేవి. ఉన్నవాటిని తొలగించి పెద్దగా సర్కిల్‌ను ఏర్పాటు చేశారు. దీంతో నాలుగు దిక్కుల నుంచి వచ్చే వాహనాలకు అడ్డు అదుపులేకుండా పోయింది. ఆ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు సైతం అందుబాటులో లేకపోవడంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారవుతోంది. ఇటీవల కాలంలో నాలుగు దిక్కులా స్పీడ్ బ్రేకర్లు వేశారు. స్పీడ్ బ్రేకర్లు ఎత్తుగా ఉండడంతో వెనుక నుంచి వచ్చే వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇదిలా ఉండగా బుధవారం సాయంత్రం కుమురంభీం చౌక్ సర్కిల్‌లో రెండు కార్లు సైతం ఢీకొట్టాయి.



దేవళ్ల నారాయణ (ఫైల్)

కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య



పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై మాలిక్ రెహమాన్

లక్ష్మణచాందా: కుటుంబ కలహాలతో తీవ్ర మనస్తాపానికి గురైన యువకుడు కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్‌రూరల్ మండలంలోని మూటాపూర్ గ్రామానికి చెందిన పులి పెద్దన్న (32)కు నిర్మల్ శాంతినగర్‌కు చెందిన లక్ష్మితో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. గత కొన్నిరోజులుగా భార్యాభర్తల మధ్య తరుచుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో భార్య లక్ష్మి తల్లిగారింటికి వెళ్లిపోయింది. ఈనెల 21న పెద్దన్న తన భార్యను తీసుకురావడానికి వెళ్లగా భార్య లక్ష్మి, ఆమె బంధువులు కలిసి పెద్దన్నపై దాడి చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన పెద్దన్న సరస్వతి కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం మండలంలోని రాచాపూర్ సమీపంలోని సరస్వతి కాలువలో మృతదేహం లభ్యమైంది. పెద్దన్న తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాలిక్ రెహమాన్ తెలి పారు.

ఉరేసుకుని ఒకరు..



తోకల సాయన్న (ఫైల్)

నర్సాపూర్ (జి): మండల కేంద్రానికి చెందిన తోకల సాయన్న అలియాస్ భోజన్న మద్యం మత్తులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల మేరకు.. నర్సాపూర్ (జి) మండల కేంద్రానికి చెందిన తోకల సాయన్న అలియాస్ భోజన్న (55) స్థానిక జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత 35 సంవత్సరాలుగా తాత్కాలిక అటెండర్‌గా పనిచేస్తున్నాడు. రెండు నెలల నుంచి పనికి వెళ్లడం మానేసి మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో ఇంటి వెనకాల గల రేకుల షెడ్డులో మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయన్న కుమారుడు తోకల వంశీరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'ఓపెన్' పరీక్షల్లో డబ్బులు వసూళ్లు!

బెల్లంపల్లి: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల్లో జోరుగా మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. ప్రస్తుతం ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు జరుగుతుండగా బెల్లంపల్లిలో ఇంటర్ విద్యార్థుల కోసం బజారు ఏరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో, టెన్త్ విద్యార్థుల కోసం బెల్లంపల్లి బస్తీలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పదో తరగతి పరీక్ష కేంద్రంలో డ్యూటీ చేస్తున్న ఇన్విజిలేటర్లు కొందరు విద్యార్థుల నుంచి బలవంతంగా ఒక్కో పరీక్షకు రూ.500 చొప్పున వసూలు చేస్తున్నట్లుగా విమర్శలు వస్తున్నాయి. డబ్బులు ఇవ్వని విద్యార్థులను టార్గెట్ చేసి మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నట్లుగా చెబుతున్నారు. డబ్బులు ఇచ్చిన వారికి చిట్టీలు అందజేసి మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అధికారులు వెంటనే స్పందించి డబ్బుల వసూలును నివారించి మాస్ కాపీయింగ్ జరగకుండా కట్టడి చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. కాగా ఈ విషయమై మంచిర్యాల ఏసీజీ దామోదర్‌రావును వివరణ కోరగా పరీక్ష రాస్తున్న విద్యార్థుల వద్ద నుంచి ఇన్విజిలేటర్లు డబ్బులు వసూలు చేస్తున్న విషయం తమ దృష్టికి రాలేదన్నారు. పరీక్ష కేంద్రాలకు స్క్వాడ్‌ను పంపించి కట్టడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మాస్ కాపీయింగ్ జరగకుండా నివారిస్తామని పేర్కొన్నారు.

వడ్డీ వ్యాపారులపై ఎస్పీ కొరడా

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో గల వడ్డీ వ్యాపారులపై ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం కొరడా ఝులిపించారు. ఆరు మండలాల్లో 30 బృందాలతో తనిఖీలు చేపట్టారు. ఆదిలాబాద్ వన్‌టౌన్, టూటౌన్, మావల, ఇచ్చోడ, బోథ్, ఉట్నూర్ తదితర ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ప్రామిసరీ నోట్లు, స్టాంప్ పేపర్లు, చెక్కులు, స్థిరాస్తి డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. వడ్డీ వ్యాపారస్తుల వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు. గురువారం వారి వివరాలు ప్రకటించే అవకాశం ఉంది.

వడ్డీ వ్యాపారుల ఇళ్లలో సోదాలు

ఇచ్చోడ: నియోజకవర్గంలోని వడ్డీ వ్యాపారులతో పాటు ఇతర ప్రైవేట్ ఫైనాన్స్ వ్యాపారుల ఇళ్లలో పోలీసులు బుధవారం సోదాలు నిర్వహించారు. సోదాల్లో వ్యాపారుల నుంచి పలు రకాల పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఇచ్చోడ, బోథ్, నేరడిగొండ, గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్‌లలో విడివిడిగా పోలీసు బృందాలు తనిఖీలు చేపట్టాయి. తనిఖీలో స్వాధీనం చేసుకున్న పత్రాలను ఆయా పోలీస్‌స్టేషన్లలో అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



అశ్విత (ఫైల్)

లక్సెట్టిపేట: మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మున్సిపల్ పరిధిలోని గోదావరి రోడ్‌కు చెందిన పందిరి అశ్విత(17) అనే ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక ఎస్సై సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్ బైపీసీ చదివిన విద్యార్థిని ఇటీవల వార్షిక పరీక్షలకు హాజరైంది. ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షకు గైర్హాజరు కావడంతో ఫెయిల్ అయింది. ఈ క్రమంలో మనస్తాపానికి గురై బుధవారం ఉదయం ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మలేషియాలో నృత్య ప్రదర్శనకు ఆహ్వానం

- నటరాజ కళాక్షేత్రం విద్యార్థులకు అవకాశం
- ఈనెల 27న ప్రదర్శన



విద్యార్థులతో డ్యాన్స్ మాస్టర్ నర్మద

జన్నారం: మలేషియాలో నృత్య ప్రదర్శన ఇచ్చేందుకు మండల కేంద్రంలోని నటరాజ కళాక్షేత్రానికి చెందిన విద్యార్థులకు అరుదైన అవకాశం లభించింది. మండల కేంద్రంలో చిన్నగా ప్రారంభమైన నటరాజ కళాక్షేత్రం అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శనకు ఎంపికవడంతో మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 27న కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చేందుకు గురువారం మలేషియకు వెళ్లనున్నారు.

2017లో ప్రారంభం..

2017లో నటరాజ కళాక్షేత్రాన్ని కూచిపూడి నృత్యం, ఫోక్ డ్యాన్సులు నేర్పించేందుకు ముగ్గురితో ప్రారంభించారు. క్రమంగా విద్యార్థుల సంఖ్య పెరగడమే కాకుండా జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రదర్శనలు ఇచ్చి అనేక బహుమతులు పొందారు. ఇప్పటివరకు 1000 మందికి పైగా విద్యార్థులు కూచిపూడి నృత్యం నేర్చుకున్నారు. కూచిపూడిలో డాక్టరేట్ పొందిన మాస్టర్ నర్మద గౌడ్ నేతృత్వంలో రెండు బ్యాచ్‌లలో 20 మంది కూచిపూడి నృత్యంలో డిప్లొమా పూర్తి చేశారు. ప్రస్తుతం 26 మంది నటరాజ కళాక్షేత్రంలో నృత్యం నేర్చుకుంటున్నారు. కూచిపూడితో పాటుగా ఫోక్ పాటలపై కూడా డ్యాన్సులు నేర్చుకుని ప్రదర్శనలు ఇస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు.

27న మలేషియాలో ప్రదర్శన..

ప్రపంచ డ్యాన్స్ డే సందర్భంగా మలేషియాలో ఉద్యోగరీత్యా స్థిరపడిన తమిళనాడుకు చెందిన ఆరుద్ర, నాట్య సమర్పణం ఆధ్వర్యంలో ఈనెల 27న నిర్వహించనున్న మలేషియా ఫెస్టివల్ కార్యక్రమంలో పాల్గొనేందుకు కొంతమంది డ్యాన్స్ మాస్టర్లకు ఆహ్వానం అందింది. అందులో తమిళనాడు రాష్ట్రం చెన్నై నుంచి కొందరు డ్యాన్స్ మాస్టర్లు, కర్ణాటక రాష్ట్రం బెంగుళూర్ నుంచి కొందరు, తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నుంచి కొందరు ఎంపికయ్యారు. వీరితో పాటుగా జన్నారం మండలకేంద్రానికి చెందిన నటరాజ కళాక్షేత్రం డ్యాన్స్ మాస్టర్ నర్మదగౌడ్‌కు ఆహ్వానం అందింది. డ్యాన్స్ మాస్టర్ నర్మద గౌడ్‌తో పాటు 9 మంది విద్యార్థులు మలేషియాలో నృత్య ప్రదర్శన ఇవ్వనున్నారు. ఈ మేరకు 10 మంది నృత్య కళాకారులతో పాటుగా మరో 15 మంది తల్లిదండ్రులు గురువారం మలేషియాకు బయలు దేరనున్నారు.

మంచి పేరు తీసుకొస్తాం..



నటరాజ కళాక్షేత్రం అంతర్జాతీయ నృత్య ప్రదర్శనకు ఎంపికవడం చాలా గర్వంగా ఉంది. మా విద్యార్థులు మలేషియాలో కూచిపూడి నృత్య ప్రదర్శన చేయనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో జన్నారం మండలానికి మంచి పేరు తీసుకొస్తాం.

– గాజుల నర్మదగౌడ్, డ్యాన్స్ మాస్టర్

కుటుంబానికి జలగండం..!

- సరస్వతి కెనాల్‌లో కొట్టుకుపోయిన యువకుడు
- గతంలో ఇద్దరు సోదరులు చెరువులో పడి మృతి



హనీఫ్

నిర్మల్‌టౌన్: ఆ కుటుంబాన్ని జలగండం వెంటాడుతోంది. గతంలో ఇద్దరు కొడుకులు చెరువులో పడి మృతి చెందగా, బుధవారం మూడో కుమారుడు సరస్వతి కెనాల్‌లో గల్లంతు కావడం ఆ కుటుంబాన్ని కన్నీటి సంద్రంలో ముంచేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దిలావర్పూర్ మండల కేంద్రానికి చెందిన ఇబ్రహీం దంపతులకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇబ్రహీం ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతంలో దిలావర్పూర్‌లో ఉండగానే ఇద్దరు కుమారులు చెరువులో పడి మృతి చెందారు. దీంతో ఇబ్రహీం తన కుటుంబాన్ని నిర్మల్ జిల్లా కేంద్రంలోని సర్ధమహల్‌కాలనీకి మార్చాడు.

ఈతకు వెళ్లి..

ఇబ్రహీం మూడో కుమారుడు హనీఫ్ (17) ఇద్దరు స్నేహితులతో కలిసి బుధవారం స్థానిక సిద్దాపూర్ సమీపంలోని సరస్వతి కెనాల్‌లో ఈతకు వెళ్లాడు. కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ముందుగా దిగిన హనీఫ్ అందులో కొట్టుకుపోయాడు. మిత్రులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు కాలువలో హనీఫ్ కోసం గాలిస్తున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. నిర్మల్ మైనారిటీ బాయ్స్ రెసిడెన్షియల్‌లో ఇంటర్ చదువుతున్న హనీఫ్ పరీక్ష ఫలితాలు మంగళవారమే వచ్చాయి. ఇందులో ఆయన పాసయ్యాడు. ఫలితాలు వచ్చిన తెల్లారే ఇలా గల్లంతు కావడంతో విషాదం నెలకొంది.

నకిలీ పత్రాలతో పెన్షన్.. కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి అని ఆదిలాబాద్ డీటీవో కార్యాలయంలో పెన్షన్ పొందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ సీఐడీ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ బుధవారం తెలిపారు. ప్రభుత్వ సొమ్మును కాజేసి తప్పించుకు తిరుగుతున్న వీరిపై సీఐడీ పోలీసులు కరీంనగర్ ఏసీబీ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నిందితులపై అరెస్ట్ వారెంట్ జారీ అయ్యింది. కాగా వారు అడ్రస్ తప్పుగా నమోదు చేశారని, వారి ఆచూకీ తెలిస్తే కరీంనగర్ సీఐడీ ఏఎస్పీ కార్యాలయానికి సమాచారం అందించాలని కోరారు. బీహార్‌లోని ముజఫర్‌పూర్‌కు చెందిన వినోద్ సింగ్ జైనథ్‌కు చెందిన వాడుగా తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించాడని, అలాగే బీహార్‌కు చెందిన సోహన్ దాస్ కమల్‌కాంత్ మహంతోలపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కప్పర్లలో భారీ అగ్నిప్రమాదం

- పశువుల కొట్టం దగ్ధం



దగ్ధమవుతున్న పశువుల కొట్టం, వాహనాలు

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగి పశువుల కొట్టం, మూడు మ్యాక్స్ వాహనాలు దగ్ధమైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు బొమ్మని బుచ్చన్న పశువుల కొట్టం గ్రామ శివారులో ఉంది. గ్రామానికి చెందిన పలువురు తమ వాహనాలను సైతం పశువుల కొట్టం దగ్గరే నిలిపి ఉంచుతారు. ఈక్రమంలో బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా పశువుల కొట్టంలో అగ్ని ప్రమాదం జరిగి పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. దీంతో పశువుల కొట్టం పూర్తిగా దగ్ధమైంది. పక్కనే పార్కింగ్ చేసిన మూడు మ్యాక్స్ వాహనాలకు సైతం మంటలు వ్యాపించాయి. రెండు మ్యాక్స్ వాహనాలు పూర్తిగా దగ్ధం కాగా మరొక వాహనం పాక్షికంగా కాలిపోయింది. ఫైర్ ఇంజన్ వచ్చే వరకు గ్రామస్తులు వ్యవసాయ బోర్ మోటార్ ద్వారా నీళ్లను చల్లి మంటలు అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. అగ్ని ప్రమాదంలో పశువుల కొట్టంలో ఉన్న పైపులు, స్ప్రింక్లర్లు, పశుగ్రాసం, వ్యవసా య సామగ్రి, మందులు, ఎరువులు, విద్యుత్ మోటార్లు ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. గ్రామానికి చెందిన గంధ్రత్ కృష్ణకుమార్, గంధ్రత్ అభిలాష్, దారుట్ల ప్రవీణ్‌లకు చెందిన మ్యాక్స్ వాహనాలు కాలిపోగా మొత్తంగా రూ.23 లక్షల కు పైగా ఆస్తినష్టం వాటిల్లింది. అగ్నిప్రమాదం ఘటన స్థలాన్ని ఆర్ఐ సంతోష్ పరిశీలించి పంచనామా నిర్వహించారు. కాగా ప్రభుత్వం తరఫున సాయం అందించి ఆదుకోవాలని రైతు బుచ్చన్న కోరుతున్నాడు. మ్యాక్స్ వాహన యజమానులకు సైతం సాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధికారుల అదుపులో ముగ్గురు వేటగాళ్లు

కోటపల్లి: మండలంలోని అభయారణ్యంలో వన్యప్రాణుల వేట విచ్చలవిడిగా కొనసాగుతోంది. వేసవికాలం కావడంతో గోదావరి, ప్రాణహిత నదితీరం వెంట వన్యప్రాణులు నీరు తాగేందుకు వస్తుండగా పెద్దపల్లి జిల్లాకు చెందిన వేటగాళ్ల ముఠా వాటిని వేటాడుతున్నారు. నది చుట్టుపక్కల ఉండే పొదలలో సేదతీరే వన్యప్రాణుల అనవాళ్లను గుర్తించిన వేటగాళ్లు గుట్టుచప్పుడు కాకుండా వేటాడుతున్నారు. ఇందుకు గాను ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చిన కుక్కలను వినియోగిస్తూ వలలతో వేట సాగిస్తున్నారు. కోటపల్లి మండలంలోని దేవులవాడ గ్రామ సమీపంలోని గోదావరి తీరంలోకి వచ్చే వన్యప్రాణులను వేటాడేందుకు వేటగాళ్ల ముఠా వేటకుక్కలతో వచ్చి అటవీ అధికారులకు చిక్కడం సంచలనం సృష్టించింది. మూడు రోజుల క్రితం వేటకుక్కలతో ఒక ముఠా దేవులవాడ గ్రామ సమీపంలోని గోదావరి నది తీరంలో మకాం వేసి వేటకుక్కల సహాయంతో అడవి పందులను వేటాడింది. ఈ విషయం అటవీ అధికారులకు తెలియడంతో అటవీ అధికారులు అక్కడికి రాగా గమనించిన వేటగాళ్లు పారిపోయే ప్రయత్నం చేశారు. అందులో ముగ్గురు వేటగాళ్లతో పాటు మూడు అడవి పందులు అటవీ అధికారుల చేతికి చిక్కాయి. ఇంతవరకు బాగానే ఉన్నా ఈ కేసు విచారణలో అధికారులు జాప్యం చేస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది. రాజకీయ పెద్దలతో ఫోన్‌లు చేయించి కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సెక్షన్ అధికారి జావిద్‌ను బుధవారం వివరణ కోరగా వేటగాళ్లను అదుపులోకి తీసుకున్నామని సమాధానం ఇచ్చారు.

తప్పిన పెను ప్రమాదం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో గతంలో మూతబడిన కేకే -5ఏ గని ఏయిర్ షాఫ్ట్‌లో మట్టి సుమారు పది మీటర్ల లోతుకు కుంగిపోయింది. ఏరియాలోని కేకే -5 గని నుంచి శంకరపల్లి వెళ్లే మార్గం పక్కన సింగరేణి ఆధ్వర్యంలో అప్పటి సింగరేణి డైరెక్టర్ బలరాం (ప్రస్తుత సీఎండీ) నాటిన మంకీస్ ఫుడ్‌కోర్ట్ ఆవరణలో మంగళవారం కుంగిపోయిన గుంతను సింగరేణి ఉద్యోగులు గుర్తించారు. విషయం తెలియడంతో అక్కడకు చేరుకున్న అధికారులు దానిని నింపే పనిలో నిమగ్నమయ్యారు. గుంతను త్వరగా గుర్తించి నింపడం వల్ల పెను ప్రమాదం తప్పిందని, లేకుంటే జంతువులు అటువైపు వెళ్లి ప్రమాదానికి గురయ్యేవని అధికారులు పేర్కొంటున్నారు. మందమర్రి ఏరియాలో గతంలో కేకే-5ఏ గని నడిచినప్పుడు ఈ ఏయిర్ షాఫ్ట్ సుమారు ఐదున్నర మీటర్ల వెడల్పు, 66 మీటర్ల వరకు ఉండేది. బొగ్గు నిల్వలు పూర్తి కావడంతో గనిని మూసి వేసిన క్రమంలో ఏయిర్ షాఫ్టులో మట్టిని నింపారు. ఏయిర్ షాఫ్ట్ ఉన్న స్థలంలో కేకే -5ఏ గనిలో బొగ్గు ఉత్పత్తి జరిగినప్పుడు 1ఏ సీము ఉండేదని లోపల ఫైర్ సీల్ గోడలు ఏమైనా పగిలిపోయి ఏయిర్ షాఫ్ట్‌లో నింపిన మట్టి కుంగి ఉంటుందని అధికారులు తెలిపారు. గని ఉపరితలంపై సుమారు ఐదున్నర మీటర్ల వెడల్పు పది మీటర్ల లోతు గుంత ఏర్పడిందన్నారు.